అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్ల తొలగింపు



షాపుల యజమానులతో మాట్లాడుతున్న అధికారులు

కుత్బుల్లాపూర్: రోడ్డుకిరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లను కుత్బుల్లాపూర్ టౌన్ ప్లానింగ్ అధికారులు ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం తొలగించారు. సుచిత్ర నుంచి కొంపల్లి వరకు బహుళ జాతి సంస్థలకు చెందిన షాపింగ్ మాల్స్ ఇతర దుకాణాలు పెద్ద ఎత్తున ఉండగా, వివిధ తినుబండారాలకు సంబంధించిన దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య వస్తుందని పోలీసులు గుర్తించారు. దీంతో అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులకు లేఖ రాసి వీటిని తొలగించాలని కోరగా.. బుధ, గురువారాల్లో రెండు శాఖల ఆధ్వర్యంలో రోడ్ల కిరువైపులా ఉన్న వాటిని తొలగించారు. నిబంధనల ప్రకారం షాపింగ్ మాల్స్ రోడ్డు వైపు ఉన్న ఖాళీ స్థలంలో ఎలాంటి దుకాణాలు ఏర్పాటు చేయవద్దని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సుచిత్ర నుంచి జీడిమెట్ల వరకు ఉన్న పలు షాపింగ్ మాల్స్ ఎదుట ఏర్పాటు చేసిన డబ్బాలను టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభావతి నేతృత్వంలో తొలగించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దుండిగల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ అధికారులు సూచించారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' లో భాగంగా దుండిగల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో సీజనల్ వ్యాధులు, వీధి కుక్కల బెడదపై పాఠశాలల్లోని పిల్లలకు గురువారం అవగాహన కల్పించారు. డెంగీ, టైఫాయిడ్, కలరా, మలేరియా, వ్యాధుల సోకకుండా ముందుగా తీసుకోవాల్సిన నివారణ చర్యలను వివరించారు. అలాగే వైద్యశాఖ అధికారులు దుండిగల్ మున్సిపల్ పరిధిలో ఫీవర్ సర్వే చేపట్టి అనుమానితుల రక్తనమూనాలు సేకరించారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేయడంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసి, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్, యాంటీ మలేరియా మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి బాబు మోసెస్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు, మేనేజర్ సునంద, దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వర్ణలత, వెటర్నరీ డాక్టర్ శైలజ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్ స్వామి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ పి సాత్విక్, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

షాపూర్‌నగర్ చౌరస్తా పరిశీలన

కుత్బుల్లాపూర్: షాపూర్‌నగర్ చౌరస్తాను సుందరీకరించనున్న నేపథ్యంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్‌తో కలిసి చౌరస్తాను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపకమిషనర్ మాట్లాడుతూ చౌరస్తాలోని ఇందిరా గాంధీ, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలు విస్తరణకు అడ్డుగా ఉన్నాయని, వాటికి అనువైన స్థలాలు కేటాయించి అభివృద్ధి చేస్తామని శ్రీశైలం గౌడ్‌కు వివరించారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ఆయన బదులిచ్చారు. వారి వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిష్టప్ప, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



శ్రీశైలంగౌడ్‌తో మాట్లాడుతున్న ఉపకమిషనర్

బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరని లోటు



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రంగారెడ్డినగర్: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుద్ధదేవ్ చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పించి రాష్ట్రాభివృద్ధి కృషి చేసిన మహోన్నత వ్యక్తిగా భట్టాచార్య ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రావుల స్వాతి, దేవదానం, బురాన్, తిమ్మప్ప, సంతోష్, రమణ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ రేణుక

జగద్గిరిగుట్ట: బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, మొదటి 6 నెలలు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని సీడీపీఓ (చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్) రేణుక పేర్కొన్నారు. గాజులరామరం డివిజన్‌లో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో సగటున 100 మంది తల్లులకు 50 మంది మాత్రమే బిడ్డలకు తల్లి పాలు ఇస్తున్నారని, ఆ శాతాన్ని పెంచాలని సూచించారు.సూపర్‌వైజర్ స్పందన, అంగన్‌వాడీ టీచర్లు, స్థానికులు పాల్గొన్నారు.

గాజులరామారం అంగన్‌వాడీకేంద్రంలో..

సుభాష్‌నగర్: గాజులరామారం అంగన్‌వాడీకేంద్రంలో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో సీడీపీవో రేణుక పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసనం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్పందన, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



నందానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు..

రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలో..

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని నందానగర్, వెంకట్రామిరెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు లలిత, జ్ఞానేశ్వరి, ప్రభావతి, రాధ, నర్సమ్మ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసనం నిర్వహించారు. హెల్పర్ బాల విజయ, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా

రంగారెడ్డినగర: గాంధీనగర్ పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని సికింద్రాబాద్ సర్కిల్ ఎస్ఈ. రవికుమార్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ ఐలా కార్యాలయంలో ఐలా కమిటీ ప్రతినిధులు గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయనతో పాటు డీఈ.భిక్షపతి, ఏడీఈ. కేవల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఈ రవికుమార్ మాట్లాడుతూ పరిశ్రమల మనుగడకు ఎలాంటి ఇబ్బందుల్లకుండా పక్కా ప్రణాళికలతో విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. పరిశ్రమల యజమానులు విద్యుత్ బిల్లుల చెల్లింపులో జాప్యం చేయవద్దని కోరారు. ఐలా చైర్మన్ పీవీ.రాజం, అసోసియేట్ అధ్యక్షుడు పైడిపల్లి స్వామిగౌడ్ మాట్లాడుతూ పరిశ్రమల యజమానులు అన్ని విధాలుగా సహకరిస్తామని పేర్కొన్నారు. పలు పరిశ్రమల ఆవరణలో రోడ్లకిరువైపులా ఉన్న ట్రాన్స్‌ఫార్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐలా ప్రతినిధులు అఖిల్, జగదీష్, సుధాకర్, రవీందర్ రావు, చంద్రం, గౌతం బేతాళ, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్, ఐలా సభ్యులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఈ రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పారిశ్రామికవేత్తలు



గాజులరామారంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి..



జీడిమెట్ల జడ్పీహెచ్ఎస్‌లో మొక్కలు నాటుతున్న కొలన్ హన్మంతరెడ్డి

ఉత్సాహంగా స్వచ్ఛదనం-పచ్చదనం

- మొక్కలు నాటిన ఎమ్మెల్యే వివేకానంద్, అధికారులు, ప్రజాప్రతినిధులు
- చెత్తాచెదారం తొలగింపు, పరిసరాల శుభ్రం



మగ్దూంనగర్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ జగన్

కుత్బుల్లాపూర్: నియోజవర్గంవ్యాప్తంగా 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని గురువారం ఉత్సాహంగా చేపట్టారు. ఇందులో భాగంగా పాఠశాలలు, కాలనీలు, బస్తీల్లో విస్తృతంగా మొక్కలు నాటారు. అదేవిధంగా బస్తీల్లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. మగ్దూంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్, బీరప్పనగర్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో పాటు ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నర్సింహ, వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

హైలాండ్ హోమ్స్‌లో..

నిజాంపేట్: నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి కమిషనర్ రామకృష్ణరావు, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌తో కలిసి 19వ డివిజన్‌లోని హైలాండ్ హోమ్స్‌లో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సిబ్బందితో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా మందుతో పాటు బ్లీచింగ్ చేయించారు. అనంతరం కాలనీవాసులకు మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాసాని సుధాకర్‌యాదవ్, విజయలక్ష్మి సుబ్బారావు, ఆగం రాజు ముదిరాజ్, కో ఆప్షన్ సభ్యులు తలారి వీరేశ్ ముదిరాజ్, నాయకులు తలారి సాయి ముదిరాజ్, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



బీరప్పనగర్‌లో మొక్కలు నాటుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలో కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి..



బాచుపల్లి హైల్యాండ్ హోమ్స్‌లో ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు

సీఎం సోదరుడి జన్మదిన వేడుకల్లో నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నిజాంపేట్: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి జన్మదిన వేడుకల్లో గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నిజాంపేట్ కార్పొరేషన్ నాయకులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, పంగా శ్రీనివాసరావు ఉన్నారు.

బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థి మృతి



అరుణ్‌కుమార్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన అరుణ్‌కుమార్ (19) మైసమ్మగూడలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం తరగతి గదిలో ఉండగా అరుణ్‌కుమార్ అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. దీంతో యాజమాన్యం వెంటనే స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పేట్‌బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా గుండెపోటు రావడంతోనే విద్యార్థి మృతి చెంది ఉంటాడని పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ పేర్కొన్నారు. అయితే అంబులెన్స్ ఆలస్యంగా రావడంతోనే అరుణ్‌కుమార్ మృతి చెందాడని తోటి విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం..!



సుభాష్‌నగర్: సూరారంలోని నారాయణ హాస్పిటల్ వద్ద నర్సాపూర్ రాష్ట్ర రహదారి పై మ్యాన్‌హోల్ కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. తరచూ ప్రమాదాలు జరగడంతో స్థానికంగా ఉన్న ఓ దుకాణ యజమాని దాని చుట్టూ రాళ్లు ఏర్పాటు చేశాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో భరోసా



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం నిరుపేద తల్లిదండ్రులకు ఎంతో భరోసా కల్పించిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని తహసీల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 57 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కే జగన్, మంత్రి సత్యనారాయణ, తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్ రావు, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, ఆర్ఐలు రజనీకాంత్, రేణుక, సిబ్బంది పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆయన నివాసంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు కలిసి గురువారం కలిశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

◆ జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్‌లో ఉప్పల హరి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన కేరళ ఆయుర్వేదిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో జీడిమెట్ల డివిజన్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నదీం రాయ్, ఎల్లా గౌడ్, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఆటో బలరాం, సమ్మయ్య నేత, కుంటి మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రి తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న రవీంద్ర నాయక్

కుత్బుల్లాపూర్: కొంపల్లి పైప్‌లైన్ రోడ్డులో ఉన్న మీడియోన్ ప్రైవేట్ దవాఖానను రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మేడ్చల్ జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ టి. రఘునాథ్ స్వామితో కలిసి రోగనిర్ధారణ సేవలు, ఔట్ పేషెంట్, ఎమర్జెన్సీ వార్డులు, లేబొరేటరీ ప్రమాణాలను పరిశీలించారు. అదేవిధంగా రోగి హక్కుల, ఫిర్యాదు ఫారాలు, అందించిన సేవల జాబితా, నాణ్యత, లైసెన్స్, అక్రిడిటేషన్, ఫైర్ సర్టిఫికేషన్ సహా భద్రత, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణను పరిశీలించారు. అనంతరం రవీంద్రనాయక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఆస్పత్రి యాజమాన్యాలు తప్పకుండా పాటించాలని, నాణ్యతతో కూడిన ఉన్నత ప్రమాణాలు పాటించాలని, మధ్యతరగతి, దిగువ ఆదాయ కుటుంబాలకు చెందిన రోగులకు వారి ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆదేశించారు.

క్వార్టర్స్‌లోనే గంజాయి మొక్కల పెంపకం

నిందితుడిని అరెస్టు చేసిన మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు



గంజాయి మొక్కలు, నిందితుడితో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కుత్బుల్లాపూర్: గంజాయిని కొనడం, వేరే చోట నుంచి తెచ్చుకోవడం రిస్క్ అనుకున్నాడు ఏమో ఏకంగా తన క్వార్టర్‌లోనే పెంచుతుండగా మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బీహార్ రాష్ట్రానికి చెందిన వికాస్ (35) ఉపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చి ధూలపల్లిలో ఉద్యోగి స్టీల్ కంపెనీలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అందులోనే యాజమాన్యం వికాస్ ఉండేందుకు క్వార్టర్స్ ఇవ్వగా 4 గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. ఈ విషయాన్ని పసిగట్టిన టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం క్వార్టర్స్‌ను సందర్శించగా గంజాయి మొక్కలు పెంచుతుండగా స్వాధీనం చేసుకుని వికాస్‌ను రిమాండ్ కు తరలించారు. బీహార్ నుంచి విత్తనాలను తీసుకువచ్చి ఇక్కడ నాటి తానే వాడుతున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

11న తులసీదాస్ జయంత్యుత్సవం

మల్కాజిగిరి: ఈ నెల 11న ఏఎస్‌రావునగర్ రైల్వే రిజర్వేషన్ కౌంటర్ సమీపంలోని హనుమాన్ ఆలయంలో తులసీదాస్ జయంత్యుత్సవం నిర్వహించనున్నట్లు హనుమత్ పీఠం వ్యవస్థాపకుడు హనుమాన్ ఉపాసకులు ఘంటసాల సత్యసాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పూజల అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందుకుంటున్న విజయ్, శ్యామ్‌కిరణ్ రెడ్డి

దుండిగల్: బీజేపీ యువమోర్చా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కన్వీనర్‌గా దుండిగల్‌కు చెందిన ఆకుల విజయ్, జాయింట్ కన్వీనర్‌గా శ్యామ్‌కిరణ్ రెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు చల్లా ప్రభాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా కన్వీనర్ ఎస్ మల్లారెడ్డి గురువారం వారికి నియామక పత్రాలు అందజేశారు. పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పద్మయ్య, ప్రధాన కార్యదర్శులు గిరి వర్ధన్ రెడ్డి, నరహరి తేజ, విగ్నేష్, అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరకాల సుధా, రాష్ట్ర నాయకులు ఒక్కంటి దయాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వరాల మహేశ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్ రంగంపేట, జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ కల సాకారం



మాట్లాడుతున్న మున్నంగి నాగరాజుమాదిగ

కుత్బుల్లాపూర్: మందకృష్ణ మాదిగ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ కల సాకారం అయ్యిందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజుమాదిగ అన్నారు. ఈ నెల 13న ఢిల్లీ నుంచి నగరానికి మందకృష్ణ మాదిగ వస్తున్న నేపథ్యంలో తలపెట్టిన విజయోత్సవ ర్యాలీ సన్నాహక సమావేశాన్ని గురువారం సూరారం అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగ ఉప కులాల అభ్యున్నతి ఎస్సీ వర్గీకరణతోనే సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ ఏపీ అధ్యక్షుడు విశ్వనాథ్ మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ, మేకల నగేశ్‌మాదిగ, బూరు రవిమాదిగ, డప్పు రామస్వామిమాదిగ, ఏర్రోళ్ల బాబుమాదిగ, తోకల చిరంజీవిమాదిగ, ముక్కెర్ల లాలయ్యమాదిగ, కోలేపాక వెంకటేశ్, సిలువేరు శ్రీనివాస్‌మాదిగ, జోగు వెంకట్, రసమళ్ల యాదగిరి, సలోమి, స్వామి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమం కీలకం



నార్త్‌సిటీ హైస్కూల్‌లో పాల్గొన్న విద్యార్థులు

సుభాష్‌నగర్: భారత స్వాతంత్ర ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలక ఘట్టం అని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేశ్ ముదిరాజ్ అన్నారు. సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్లో గురువారం 84వ క్విట్ ఇండియా డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా క్విట్ ఇండియా ఉద్యమం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ కోలా వెంకటేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ స్వాతంత్రం కోసం భారతీయులు చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. నాటి స్వాతంత్ర సమరయోధులను ఆదర్శంగా తీసుకుని యువత సమయం వృథా చేయకుండా, వ్యసనాలకు గురికాకుండా సన్మార్గంలో నడవాలని సూచించారు.

కేబుల్ ఆపరేటర్ల సమావేశం



మాట్లాడుతున్న ఎంఎస్ఓ నాయకుడు సదానందం

చింతల్: విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను సంబంధిత శాఖ అధికారులు తొలగిస్తున్న నేపథ్యంలో చింతల్ శ్రీసాయికాలనీలోని శ్రీసాయి కమ్యూనికేషన్స్ కేబుల్ టీవీ అండ్ బ్రాడ్‌బాండ్ కార్యాలయంలో ఎంఎస్ఓలు, టెక్నీషియన్లు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ కేబుల్ టీవీ అసోసియేషన్ నాయకుడు సదానందం మాట్లాడుతూ స్థానికంగా ఉన్న కేబుల్ ఆపరేటర్లు స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించి అధికారులకు సహకరించాలని, లైన్లను క్లియర్ చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

రిపోర్టర్‌పై కేసు

దుండిగల్: తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా రోడ్డు పనులు నిలిపివేయాలని ఇబ్బందులుకు గురి చేస్తున్న రిపోర్టర్‌పై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బహదూర్‌పల్లిలోని గాయత్రినగర్‌లో రూ.60 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు వేస్తున్నారు. అయితే పీడీఎఫ్ పత్రికలో పని చేస్తున్న ఓ రిపోర్టర్ తరుచూ తనకు ఫోన్ చేసి రోడ్డు పనులు నిలిపేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, అలాగే తన విధులకు ఆటంకం కలిగిస్తున్నడని గండిమైసమ్మ-దుండిగల్ మండల తహసీల్దార్ ఎస్ఏ మతిన్ హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు ఆదేశాలతో దుండిగల్ పోలీసులు విలేకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

108లో ఉద్యోగ అవకాశాలు

మేడ్చల్: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థలోని 108 కాల్ సెంటర్‌లో పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్‌షాహిద్ తెలిపారు. శుక్రవారం నుంచి ఈ నెల 31 వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్యాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్‌లు ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. 92461 71575, 95505 20402 నెంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.